క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఆయుష్ హోమం

నున్న(విజయవాడరూరల్): ప్రజలందరూ ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో జీవించాలనే సంకల్పంతో శుక్రవారం నున్న గ్రామంలోని యోగీశ్వర్ దేవీదయాళ్ మందిరంలో స్వామి అమిత్‌దేవ్‌జీ వేదపండితులతో ఆయుష్ హోమం నిర్వహించారు. స్వామీజీ దక్షిణ యాత్రలో భాగంగా 40 రోజులుగా నున్న యోగీశ్వర్‌దేవీదయాళ్ మందిరంలో నిర్వహిస్తున్నారు. మహామృత్యుంజయ జపతర్పణ హోమ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పంచామృతాలు, మూలికాద్రవ్యాలు, సుగంధ ద్రవ్యాలతో పూజా కార్యక్రమాలు జరిపారు. గ్రామంలోని అనేక మంది పుణ్య దంపతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వివేకానంద ఆశయాలు స్ఫూర్తిదాయకం



పెనమలూరు: స్వామి వివేకానంద ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని విజయవాడ రామకృష్ణ మిషన్ సహాయ కార్యదర్శి స్వామి యజ్ఞపురుషానంద హజరయ్య అన్నారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ పి.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

కానూరులో..

కానూరు అశోక్ జిమ్‌లో మాతృహృదయ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, క్రీడాకారులు స్వామి వివేకానంద జయంతి ఘనంగా చేశారు. వివేకానంద ఫొటోకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి తాళ్లూరి అశోక్, సీపీఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెనమలూరులో వైఎస్సార్ సీపీని గెలిపిస్తాం



ఉయ్యూరు: పెనమలూరులో వైఎస్సార్ సీపీ పార్టీని గెలిపిస్తామని కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు దాసు శ్రీనివాసరావు అన్నారు. పెనమలూరు ఇన్‌చార్జిగా నియమితులైన మంత్రి జోగి రమేష్‌ను శుక్రవారం ఆయన కలిసి మద్దతు తెలిపారు. దాసుతో పాటు నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, బీసీ సంఘాల నేతలు మంత్రి రమేష్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దాసు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా నాయకుడు జోగి రమేష్ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెనమలూరుకు ఇన్‌చార్జిగా నియమించిన మంత్రి జోగికి సంపూర్ణ మద్దతు ఇస్తామన్నారు.

బాలికలకు ఉచిత భోజనం

పెనమలూరు: కానూరులో శుక్రవారం 70 మంది బాలికలకు ఉచిత భోజనం పెట్టారు. గ్రామంలో వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల వసతి గృహంలో దాత నిమ్మగడ్డ బాబురాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిమ్మగడ్డ సోమశేఖర్, కోటేశ్వరమ్మల జ్ఞాపకార్థం భోజనం పెట్టారు.

పోరంకిలో బైక్ చోరీ

పెనమలూరు: పోరంకి గ్రామంలో బైక్ చోరీ జరగటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి గ్రామానికి చెందిన అక్కిదాసరి అజయ్ ప్రైవేటు కంపెనీలో పని చేస్తాడు. అతనికి బుల్లెట్ బైక్ ఉంది. కాగా అతను ఈ నెల 6వ తేదీ రాత్రి ఆఫీసు నుంచి రాత్రి వచ్చి ఇంటి ముందు రోడ్డు పై బైక్ పార్కు చేశాడు. అతను 7వ తేదీ ఉదయం లేచి చూసుకునే సరికి గుర్తు తెలియని వ్యక్తులు అతని బైక్ చోరీ చేశారు. బైక్ కోసం వెతికినా దొరకక పోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వివాహితపై అసభ్య ప్రవర్తన.. వ్యక్తిపై కేసు

పెనమలూరు: వివాహిత పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పెదపులిపాక శ్రీనగర్ కాలనీకి చెందిన రాయుడు అన్నవరం (అలియాస్ అనూష) కుటుంబ సభ్యులతో ఉంటుంది. ఆమెకు నెల్లూరు నవాబ్‌పేటకు చెందిన కట్ట మూడి రామకృష్ణ గత కొద్దికాలం క్రితం ఫేస్‌బుక్‌లో పరిచయమయ్యాడు. కాగా ఈ నెల 6వ తేదీన అనూష పుట్టిన రోజు సందర్భంగా గిఫ్టులు, స్వీట్లు తీసుకుని అనూష ఇంటికి రామకృష్ణ వచ్చాడు. అతను ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

రోడ్డు నిర్మాణానికి తీర్మానం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశం గ్రామ సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సమావేశంలో వంగవీటి మోహన రంగ విగ్రహం నుంచి ముస్లిం శ్మశనాల వైపు రోడ్డు 250 మీటర్లు నిర్మించేందుకు సమావేశం ఇంజినీరింగ్ విభాగాన్ని అంచనాలు కోరుతూ తీర్మానం చేసింది. అలాగే మైక్రోఫిల్టర్ వద్ద షెడ్డు నిర్మాణం చేయాలని నిర్ణయించింది. ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని, కార్యదర్శి జీటీవీ రమణ పాల్గొన్నారు.

రారండోయ్ వేడుక చూద్దాం

- నేటి నుంచి పేరంటాలమ్మ ఆలయంలో సంక్రాంతి సంబరాలు
- 14 నుంచి 18 వరకు నిరాటంకంగా అమ్మవారి గ్రామోత్సవం
- 18న తెప్పోత్సవం, రావిచెట్టు వద్ద పూలంకి సేవ
- 20న ఉత్సవాలు ముగింపు సందర్భంగా అన్నసంతర్పణ



ఉత్సవాలకు ముస్తాబైన రామవరప్పాడులోని పేరంటాలమ్మ ఆలయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శనివారం నుంచి సంక్రాంతి జాతర మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. దీంతో ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయం మొత్తాన్ని రంగులు వెదజల్లే విద్యుత్ దీపాలతో అలంకరించారు. 13న భోగి సందర్భంగా ఉదయం 5గంటల నుంచి దర్శనం, వాహన పూజలు, మొక్కుబడులు కార్యక్రమాలు జరగనున్నాయి. 14 మకర సంక్రాంతిన విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, కుంకుమ పూజలతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అదే రోజు సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం ప్రారంభమవుతుంది. నిరాటంకంగా 5 రోజుల పాటు రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో కనుల పండువగా నిర్వహిస్తారు. 18న ఆలయ సమీపంలోని రైవస్ కాలువలో తెప్పోత్సవం, రాత్రి రావిచెట్టు ఎదుట పూలంగి (ఊయల) సేవను ఘనంగా నిర్వహిస్తారు. 20న ఆలయంలో ఉత్సవాల ముగింపు సందర్భంగా భారీ అన్నసంతర్పణ కార్యక్రమం జరుగుతుంది. ఉత్సవాల్లో భాగంగా జరిగే గ్రామోత్సవానికి సంభందించి రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయంలో క్యూలైన్లు, తాగునీటి వసతి, మొక్కుబడులు చెల్లించుకునేందుకు ఏర్పాట్లను ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరిలు పూర్తి చేశారు.



పుట్టింటి నుంచి గ్రామోత్సవంగా ఆలయానికి చేరుకున్న పేరంటాలమ్మ

ఆలయ ప్రవేశం చేసిన పేరంటాలమ్మ

రెండేళ్లకొకసారి సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లను పుట్టింటికి తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఈనెల 3న గ్రామంలో రాజులబజార్‌లోని అమ్మవారి పుట్టింటికి పేరంటాలమ్మను మేళ తాళాల నడుమ గ్రామోత్సవంగా తీసుకెళ్లారు. అప్పటి నుంచి ఉత్సవాలకు ఒక రోజు ముందు వరకు అమ్మవార్లు పుట్టింటిలోనే పూజలందుకున్నారు. శనివారం నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతుండటంతో శుక్రవారం సాయంత్రం అమ్మవారి వారసులైన కళ్లెపల్లి ప్రభాకర్ వర్మ, నరసరాజు, భూపాల్‌రాజు సోదరులతో పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు బహూకరణతో పాటు యాదవ వంశస్తులైన వేమినేని వారితో పోతు సమర్పణ అనంతరం పుట్టింటి నుంచి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించి అమ్మవార్లను ఆలయానికి తీసుకొచ్చారు.

బంధుమిత్రులతో కళకళ..

ఏటా అత్యంత ఘనంగా నిర్వహించే గ్రామ దేవత పేరంటాలమ్మ సంబరాలకు దేశంలో ఎక్కడెక్కడో స్థిరపడిన రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల ఆడపడుచులు, ఉద్యోగస్తులు, తమ కుటుంబ సమేతంగా ఉత్సవాల్లో పాల్గొంటారు. ఈ సంవత్సరం కూడా రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో కొత్త అలుళ్లు, బంధుమిత్రులతో కళకళలాడుతున్నాయి.

కొలువుదీరిన ఏఎంసీ పాలకవర్గం



బాధ్యతలు స్వీకరిస్తున్న ఏఎంసీ చైర్ పర్సన్ తోట కరుణ, చిత్రంలో డైరెక్టర్లు

గన్నవరం: వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం శుక్రవారం కొలువుదీరింది. స్థానిక మార్కెట్ యార్డులో ఏఎంసీ చైర్ పర్సన్‌గా తోట కరుణ, వైస్ చైర్మన్‌గా నాగనబోయిన బాలమధుర శ్రీ, మరో 14 మందితో కూడిన కమిటీ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన చైర్ పర్సన్ తోట కరుణ, వెంకయ్య దంపతులను పాలకవర్గంతో పాటు ఏఎంసీ అధికారులు, సిబ్బంది, బంధుమిత్రులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలోని రైతాంగానికి మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. పంట పొలాలకు వెళ్లే డొంక రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు. ముఖ్యంగా రైతులకు అవసరాలకు అనుగుణంగా గిడ్డంగులను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. అన్నదాతలకు సేవా చేసుకునే గొప్ప అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, ఏఎంసీ ప్రత్యేక కార్యదర్శి ఏ. కిషోర్, ఏఎంసీ గ్రేడ్-3 కార్యదర్శి పి. జ్యోతి, సర్పంచి నిడమర్తి సౌజన్య, పార్టీ నాయకులు నాగనబోయిన గిరీష్‌రాజు, పామర్తి మాధవ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు అభినందన

గన్నవరం రూరల్: గన్నవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్ పర్సన్‌గా పదవీ భాధ్యతలు చేపట్టిన తోట కరుణకు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం అభినందనలు తెలిపారు. మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పామర్తి మాధవరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు కందిమళ్ల శ్రీనివాసరావు, సూరంపల్లి పంచాయతీ వార్డు సభ్యుడు కందిమళ్ల రాఘవ అభినందనలు తెలియజేస్తూ ఏఎంసీ మరింత ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన



జంక్షన్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

గన్నవరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని నూర్‌బాషా, దూదేకుల ముస్లిం, మైనార్టీల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పులిమర్తి చిన్నమస్తాన్ పిలుపునిచ్చారు. స్థానిక సంఘ కార్యాలయంలో శుక్రవారం సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ బాజీతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సామాజిక సమానత్వం, సామాజిక న్యాయాన్ని పెంపొందించే విధంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారత రాజ్యాంగాన్ని రూపొందించారని చెప్పారు. ఇటువంటి మహోన్నతుడిని స్మరించుకునేందుకు 125 అడుగుల విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు చారిత్రాత్మకం

హనుమాన్‌జంక్షన్ రూరల్: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 125 అడుగుల ఎత్తయిన విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున నిర్మించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు పొలిమెట్ల జయరాజు అన్నారు. స్థానిక విజయవాడ రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

19న ప్రారంభోత్సవం..

భారతజాతి ముద్దుబిడ్డ అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేయటం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదిన ముఖ్యమంత్రి చేతుల మీదగా దీనిని ఆవిష్కరించనున్నారని చెప్పారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌మూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కాండ్రు జయరాజు, ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు ఐనంపూడి ఆశీర్వాదం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీటీసీ బొంతు సరోజిని

జయప్రదం చేద్దాం..

నున్న(విజయవాడరూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 19న జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని కోరారు. జన్ భగీదరి కార్యక్రమంలో భాగంగా నున్న పంచాయతీ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంతకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, కార్యదర్శి జీటీవీ రమణ, పలువురు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జోరుగా 'ఆడుదాం ఆంధ్రా'



వణుకూరులో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు



కబడ్డీ పోటీల టాస్ వేస్తున్న ఎంపీపీ రవి

పెనమలూరు: మండల పరిధిలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ఆసక్తిగా జరుగుతున్నాయి. వణుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఖోఖో పోటీలు నిర్వహించారు. షటిల్ పోటీల్లో పెనమలూరు-2 సచివాలయం నుంచి పురుషుల జట్టు, పెనమలూరు-3 నుంచి మహిళల జట్టు మండల పరిధిలో గెలిచింది. గోసాల-1 సచివాలయం పరిధిలో పురుషుల వాలీబాల్ జట్టు గెలిచింది. గంగూరు-2 సచివాలయం పరిధిలో మహిళల వాలీబాల్ జట్టు విజయం సాధించింది. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి.

కానూరులో...

కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో ఆటల పోటీలు జరుగుతున్నాయి. కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్ పోటీలు శుక్రవారం నిర్వహించారు.

ఉత్సాహంగా పోటీలు..

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ విభాగాల్లో శుక్రవారం జరిగిన పోటీల్లో పలు గ్రామసచివాలయాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. తొలుత కబడ్డీ మ్యాచ్‌లను ఎంపీపీ అనగాని రవి టాస్ వేసి ప్రారంభించారు. స్థానిక కేవీఆర్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ డబుల్స్, ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. ఎంపీడీఓ ఈ. సత్యకుమార్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జయరాజు, క్రీడా సమన్వయకర్త డి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత కంకిపాడు-3..

కంకిపాడు: వాలీబాల్ పురుషుల విభాగం విజేతగా కంకిపాడు-3 సచివాలయ జట్టు నిలిచింది. ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు మండలంలోని ఈడుపుగల్లు, ప్రొద్దుటూరు, పునాదిపాడు గ్రామాల్లో ఉత్సాహంగా జరుగుతున్నాయి. వాలీబాల్ పురుషుల విభాగం ఫైనల్స్ పోటీలు ప్రొద్దుటూరు క్రీడా మైదానంలో ఉత్కంఠభరితంగా సాగాయి. కంకిపాడు-3, కోలవెన్ను జట్ల మధ్య హోరాహోరీగా సాగిన పోటీలో కంకిపాడు-3 జట్టు విజేతగా నిలిచింది.

పేదల పెన్నిధి సీఎం జగన్



నున్న(విజయవాడరూరల్): పేదల పెన్నిధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నున్న గ్రామంలో కొత్తగా 57 మందికి పింఛన్లు మంజూరు చేసిన సందర్భంగా వారికి మూడు వేల రూపాయల చొప్పున పింఛన్లు అందజేసే కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సామాజిక భద్రతా పింఛన్లు మూడు వేల రూపాయలకు పెంచడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని సాంబిరెడ్డి, గ్రామ సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి, పాలకవర్గ సభ్యులు కాటూరి శ్రీనివాసరావు, యర్కారెడ్డి వెంకటరెడ్డి, ప్రత్తిపాటి సుందరయ్య, సైదాబీ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరు సబ్‌స్టేషన్ సరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ పి.హరిబాబు అన్నారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ శనివారం మురళీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. గౌరీశంకర్‌నగర్, మురళీనగర్, బల్లెంవారి వీధి ప్రాంతాల్లో స్థానికులు సహకరించాలని కోరారు.

• తాగునీటి పైప్ లైన్‌కు మరమ్మతులు

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వెంకటనరసింహాపురం కాలనీలో తాగునీటి సరఫరా పునరుద్ధరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం భారీ వాహనాల రాకపోకల కారణంగా మెయిన్ పైపులైన్ దెబ్బతీంది. దీంతో సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన మరమ్మతుల పనులు చేపట్టారు. సుమారు 15 అడుగుల లోతులో ఉన్న పైపులైన్‌కు మరమ్మతులు కోసం తవ్వకాలు జరిపారు.

• పీహెచ్‌సీకి వీల్ చైర్స్ వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లోని బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రముఖ పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ రెండు వీల్ చైర్స్‌ను వితరణగా అందించారు. వృద్ధులు, వికలాంగులు, రోగులు ఆస్పత్రిలోకి వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారని పీహెచ్‌సీ వైద్యాధికారులు పుట్టగుంట దృష్టికి తీసుకురావటంతో ఆయన స్పందించారు. దీంతో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూషాకు శుక్రవారం రెండు వీల్ చైర్స్‌ను అందించారు.

• ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

హనుమాన్‌జంక్షన్ రూరల్: రబీ సీజన్‌లో మినుము, పెసర, మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జొన్నలగడ్డ భవాని తెలిపారు. బాపులపాడు మండలం పెరికీడులో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదును శుక్రవారం ఆమె పరిశీలించారు. మండలంలో 14,948 ఎకరాలకు గానూ ఇప్పటి వరకూ 4,560 ఎకరాలలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి అయిందని చెప్పారు.

• కోడి పందేలు వేస్తే కఠిన చర్యలు

పెనమలూరు: సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాలలో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య అన్నారు. పెనమలూరు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ సునీతాశర్మ, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

• వైద్య శిబిరానికి విశేష స్పందన

కంకిపాడు: లయన్స్‌క్లబ్ ఆఫ్ కంకిపాడు, పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజ్ సంయుక్త ఆధ్వర్యంలో కంకిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ రకాల అనారోగ్య సమస్యలకు 20 మంది వైద్యులతో కూడిన బృందం రోగులను పరీక్షించింది. 100 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. లయన్స్ అఫీషియల్ గొట్టిపాటి రామకృష్ణ, గవర్నర్ జీవీ శంకర్‌గుప్తా, సెక్రటరీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

• పారదర్శకంగా సంక్షేమం

ఉంగుటూరు: అన్ని వర్గాల వారికి పారదర్శకంగా సంక్షేమాన్ని అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. తరిగొప్పల గ్రామ సచివాలయం వద్ద పల్లెకు పోదం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ యాంద్రపు అనిత, ఎంపీటీసీ నటరాజన్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

• రైతులకు అందుబాటులో ఎరువులు

నున్న(విజయవాడరూరల్): రబీ సీజన్‌కు అవసరమైన ఎరువులను గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచామని విజయవాడ వ్యవసాయ శాఖ ఏడీ బి.వెంకటేశ్వరావు తెలిపారు. శుక్రవారం నున్న గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి అధ్యక్షతన జరిగింది.

ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు

జిల్లా వైద్యాధికారి గీతాబాయ్



గంగూరులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి గీతాబాయ్



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేస్తున్న సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తదితరులు

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతోనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని జిల్లా వైద్యాధికారి గీతాబాయ్ అన్నారు. గంగూరు-1లో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో సర్వే చేసి అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించామన్నారు. వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నామన్నారు. మండల వైద్యాధికారి బిజిలీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోరంకిలో..

పోరంకి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యసేవలు

రామవరప్పాడు: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యసేవలు అందుతున్నాయని ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు సచివాలయం-2లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహించి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సువర్ణరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్. వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు రాచమళ్ల రత్నకుమారి, గంగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మానికొండలో..

ఉంగుటూరు: మానికొండ గ్రామ సచివాలయం-1 వద్ద రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ వైద్య శిబిరంలో గైనకాలజిస్ట్ డాక్టర్ లీన, జనరల్ మెడిసన్ డాక్టర్ రాజేష్, పీహెచ్‌సీ డాక్టర్ సుబ్బారావు, నేత్ర వైద్యులు రాజేష్ 473మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వర్ణలత, ఎంపీడీవో శేషగిరిరావు, ఈవోపీఆర్‌డీ అమీర్ బాషా, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ గోగినేని వెంకటేశ్వరరావు(బాబు) పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



సంప్రదాయ వస్త్రధారణలో ర్యాంప్ వాక్ చేస్తున్న ఎస్ఆర్‌కే విద్యార్థులు



ముగ్గుల పోటీల్లో విజేతకు బహుమతి అందిస్తున్న డీఎస్పీ జయసూర్య

గన్నవరం: సంక్రాంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ముగ్గుల పోటీలను నిర్వహించారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల రంగవల్లికలను తీర్చిదిద్దారు. పోటీల్లో వరుసగా మూడు స్థానాల్లో నిలిచిన మహిళలకు డీఎస్పీ జయసూర్య, ఏఎస్పీ ప్రసన్న, సర్పంచి నిడమర్తి సౌజన్య బహుమతులు ప్రదానం చేశారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్ఆర్‌కే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థిని, విద్యార్థులు తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు. కళాశాల ఆవరణలో రకరకాల రంగవల్లులను తీర్చిదిద్దారు. భోగి మంటలు చుట్టూ ఉత్సాహంగా తిరుగుతూ సంక్రాంతి గేయాలు ఆలపించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



పెనమలూరు: మండలంలో 2022-2023 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డ్వామా ఏవో ఎ.మహేశ్వరరావు మాట్లాడుతూ మండల పరిధిలో ఉపాధి హామీ పథకం కింద కూలీలకు 855 పనులకు గానూ వేతనాలు రూ. 1,54,96,855 చెల్లించామన్నారు. పంట కాలువలు, బోదెలు, చెరువులు మరమ్మతులు చేశారన్నారు. ఇక పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో మొత్తం సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు భవనాల నిర్మాణానికి సంబంధించిన 111 పనుల మెటీరియల్ కోసం రూ. 5,60,77,192 వెచ్చించామని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ పనులు రెండు చేయగా మెటీరియల్ కోసం రూ. 21,21,520, వేతనాల కోసం రూ. 1,54,96,855 కలిపి మొత్తం రూ. 7,37,03,448 ఖర్చు చేశామన్నారు. తమ తనిఖీల్లో లోపాలు లేవని అన్నారు. కాగా ఉపాధి పథకం కింద చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని చోడవరం సర్పంచి కాకర్ల వెంకటరత్నం అధికారులను కోరారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి వి. శ్రీలత, ఎంపీడీఓ సునీతాశర్మ, పీఆర్ డీఈ శ్రీనివాసరావు, ఇమ్మానియేల్, ఏపీఎం బసవరాజు, ఎస్ఆర్‌పీ రాజు పలువురు పాల్గొన్నారు.